

పండగ పూటా.. నీటికై వేట

ప్రజలంతా శ్రీరామ నవమి సంబురాల్లో మునిగి తేలుతుంటే.. ఆ గ్రామంలో మాత్రం తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



ఆస్తి పన్ను చెల్లిస్తే రాయితీ

2025–26 సంవత్సరం ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఐదు శాతం సబ్సిడీ ప్రకటించింది. 9లో▸



కార్మికుల పక్షపాతి..

కార్మికుల పక్షపాతి బీటీ రణదివే అని సీపీఎం, సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

24న చుక్కా రామయ్య ప్రవేశ పరీక్ష

18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

అనంతగిరి: ఐఐటీ చుక్కా రామయ్య ట్రస్ట్‌లో ఉచిత విద్య కోసం ఈ నెల 24న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు 5, 6, 7తరగతుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఎంట్రెన్స్‌కు ఈ నెల 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు వికారాబాద్‌లో వెంకటరత్నం 9440483015, తాండూర్‌లో యండీ సలీం 96521802819, కొడంగల్‌లో కృష్ణవేణి 9849585729, పరిగిలో రాములు 9491676672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వయం ఉపాధి కార్యక్రమాలతో ఆర్థిక ప్రగతి

గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



మొబైల్ క్యాంటీన్ ప్రారంభిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా సెర్ప్ సహకారంతో మండల కేంద్రంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో మొబైల్ క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఈ మొబైల్ క్యాంటీన్‌ను ఆదివారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఐకేపీ సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కార్యక్రమాలు మహిళలకు ప్రగతినిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింలుగౌడ్, రాంచందర్‌రెడ్డి, జయకృష్ణ, వెంకట్‌రాములు గౌడ్, మల్లేష్, ఐకేపీ సిబ్బంది సాయన్న మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీతో దేశం సురక్షితం

కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మారుతికిరణ్

పరిగి: బీజేపీతోనే దేశం సురక్షితంగా ఉంటుందని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. ఆదివారం బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ బడుగుల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో ఎన్నో సంస్కరణలు వచ్చాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, అనిల్, వెంకటయ్య, ఆంజనేయులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘నీరా’ కేంద్రానికి ఏపీ ఎక్సైజ్ అధికారులు



నీరా తయారీ విధానం గురించి అడిగి తెలుసుకుంటున్న శ్రీదేవి

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ‘నీరా’ తయారీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ డివిజన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎక్సైజ్‌శాఖ అధికారులతో కలిసి ఆదివారం సందర్శించారు. గీత కార్మికులకు లాభాలు చేకూర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నీరా తయారీ విధానాన్ని పరిశీలించారు. చెట్టు నుంచి ఏ విధంగా సేకరిస్తున్నారు.. ఎంత మేర ఉత్పత్తి అవుతోంది.. నీరా నుంచి అదనపు ఉత్పత్తుల (బై ప్రొడక్ట్)ను ఎలా తయారు చేయాలి తదితర విషయాలను నీరా కేంద్రం శాస్త్రవేత్త సత్యంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చరికొండ గ్రామంలో పర్యటించి తాటి చెట్ల నుంచి నీరా సేకరణ గురించి గీత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్‌ఐ అరుణ్‌కుమార్, ఈసీ బాబు తదితరలు పాల్గొన్నారు.



యాలాల: జుంటుపల్లి రామాలయంలో ఉత్సవమూర్తులు



అనంతగిరి: రామమందిరంలో హాజరైన అశేష భక్తజనం



అనంతగిరి: వికారాబాద్ రామాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పూజలు

రమణీయం.. రాములోరి కల్యాణం

శ్రీరామనవమి వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను ఊరేగింపుగా మండపాలకు తీసుకొచ్చారు. పచ్చనిపందిళ్లు.. పూల తోరణాలు.. మేళతాళాలు.. ముత్యాల తలంబ్రాలు.. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో సీతారాముల కల్యాణతంతును వైభవంగా జరిపించారు. కల్యాణఘట్టాన్ని కనులారా వీక్షించిన భక్తులు పులకించిపోయారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. కోలాటాలు, జైశ్రీరామ్ నామస్మరణ నడుమ సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు కొనసాగింది.

– సాక్షి, నెట్‌వర్క్



బొంరాస్‌పేట మండల కేంద్రంలో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కలప కనుమరుగు

వాల్టా చట్టానికి తూట్లు

- రాత్రిళ్లు రవాణా చేస్తున్న వ్యాపారులు
- అక్రమ దందాతో సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అటవీ, రెవెన్యూ అధికారులు



సాయన్నగూడ వద్ద నరికిన వృక్షాలు



పూలపల్లి వద్ద కలపను లారీలో నింపుతున్న వ్యాపారులు (ఫైల్)

నవాబుపేట: మండల పరిధిలో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అనుమతులు లేకుండానే నిత్యం వేల సంఖ్యలో వృక్షాలను నరికివేస్తూ రాత్రిళ్లు రవాణా చేస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు అటుగా కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో వనమహోత్సవానికి చర్యలు తీసుకుంటుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది. మండల పరిధిలోని పులుమామిడి, అక్నాపూర్, పూలపల్లి, నారెగూడ, గంగ్యాడ, ఎల్లకొండ, మైతాప్‌ఖాన్‌గూడ, చిట్టిగిద్ద, లింగంపల్లి, ముబారక్‌పూర్ తదితర గ్రామాల్లో కలప వ్యాపారులు చెట్లను కొనుగోలు చేసి విచ్చలవిడిగా నరికి రాత్రిళ్లు ఎవరి కంటా పడకుండా రవాణా చేస్తున్నారు. రేణి, తుమ్మ వేప, చింత, తదితర చెట్లను రైతుల వద్ద తక్కువ ధరలకు కొని వ్యాపారులు యథేచ్ఛగా ప్రకృతి సంపదను నాశనం చేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు.

సీజన్ వస్తే వాలిపోతున్న వ్యాపారులు

ప్రతీ ఏడాది ఈ సీజన్‌లో ఇబ్రహీంపట్నంకు చెందిన కలప వ్యాపారులు, శంకర్‌పల్లి, సంగారెడ్డికి చెందిన పలువురు కట్టకోత మెషిన్ల యజమానులు ఇక్కడ వాలిపోతుంటారు. ప్రకృతి సంపదను నాశనం చేస్తూ భారీగా సొమ్ముచేసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మొదలుకొని జూన్ వరకు కలప తరలిస్తూ సొమ్ము చేసుకోవడం ఆనవాయితీగా మారింది.

అధికారులపై విమర్శలు

ప్రకృతి సహజ వనరుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన వాల్టా చట్టానికి వ్యాపారులు తూట్లు పొడుస్తున్నారు. చట్టాన్ని పరిరక్షించాల్సిన రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై మండలంలో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కలప, ఇసుక, ఎర్రమట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకునే వారే లేరు



గ్రామాల్లో విచ్చల విడిగా చెట్లను నరికి తీసుకెళ్తుంటే పట్టించుకునే వారే లేరు. రెవెన్యూ, ఫారెస్టు అధికారులు ఎక్కడుంటారో తెలియదు. అక్రమ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారనే అనుమానం వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఎల్లకొండ

అటవీ సంపదను కాపాడాలి



ప్రభుత్వం అనుమతులు లేకుండానే వ్యాపారులు అటవీ సంపద కొల్లగొడుతున్నారు. అటవీ సంపద తగ్గడంతో ఇప్పటికే వర్షాలు సమృద్ధిగా కురవడం లేదు. అధికారులు స్పందించి అటవీ సందపను కాపాడాలి.

– శేఖర్‌రెడ్డి, రైతు, నారెగూడ

అధికారుల నిర్లక్ష్యమే



గ్రామాల్లో విచ్చల విడిగా చెట్లు నరికివేస్తున్నారు. వ్యాపారులు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన ఫారెస్టు, రెవెన్యూ అధికారుల నుంచి ఎటువంటి చర్యలు లేవు. దీంతో వృక్షాలు కనుమరుగవుతున్నాయి.

– రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకుడు, పులుమామిడి

కఠిన చర్యలు



వాల్టా చట్టాన్ని చేతులోకి తీసుకుని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా చెట్లు నరకడం, ఎర్రమట్టి తరలించడం సరికాదు. ప్రజలకు సమాచారం ఇస్తే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం.

– జైరాం, తహసీల్దార్, నవాబుపేట

రాములోరి కల్యాణానికి | రాజకీయ రంగు

- విశ్వావసులో ప్రజల విశ్వాసం కోసం నేతల యత్నం
- తాండూరు శ్రీరామ నవమి వేడుకలకు పోటాపోటీగా హాజరు
- స్థానిక సంస్థల్లో సత్తా చాటేందుకు తహతహ



పట్నం మహేందర్‌రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్

బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే,తాండూరు

పైలెట్ రోహిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే,తాండూరు

తాండూరు: విశ్వావసు నామ సంవత్సరంలో వచ్చే తొలి పండుగ శ్రీరామ నవమి తాండూరులో సందడిని తలపించింది. గతంలో పట్టణంలో ఒకటి, రెండు చోట్ల, మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించేవారు. ప్రస్తుతం నేతల ప్రోత్సాహంతో ప్రతీ గ్రామంలో ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కల్యాణోత్సవాలకు ప్రధాన పార్టీల నేతలు పోటీ పడుతూ పూజలు చేపట్టారు. దీంతో కొన్నాళ్లుగా నియోజకవర్గానికి దూరంగా ఉన్న నేతలు పండగ రోజు తాండూరులో పోటాపోటీగా పర్యటించి సందడి చేశారు. ప్రస్తుతం ఈ విషయం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

వేడెక్కిన రాజకీయం

తాండూరు నియోజకవర్గ రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. నిన్నటి వరకు తాండూరులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఒక్కరే పర్యటిస్తూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రారంభించారు. ఏడాది కాలంగా తాండూరులో రాజకీయ ప్రత్యర్థులు లేకపోవడంతో బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రశాంతంగా ఉన్నారు. శ్రీరామ నవమి పండుగ రోజు నుంచి శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తాండూరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. దీంతో తాండూరులో నేతలు పట్టుకోసం ప్రయత్నిస్తున్నారనే చర్చలు ఊపందుకున్నాయి. పట్నం మహేందర్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. రెండు రోజుల క్రితం యాలాల మండల పరిధిలోని జుంటుపల్లి రామాలయం వద్ద శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో పట్నం మహేందర్‌రెడ్డి ఫొటో ఉంచడంపై దేవాదాయ శాఖ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చర్చనీయాంశమైంది. ఇదే క్రమంలో పట్నం వెంట కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఎవరు కనిపించకపోవడంపై తాండూరులో రకరకాల చర్చలు వినిపిస్తున్నాయి.

సైలెంట్‌గా దూసుకెళ్తున్న పైలెట్

గత ఎన్నికల్లో తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఓటమి చెందారు. నాటి నుంచి నియోజకవర్గానికి అడపదడపా వచ్చి వెళ్తున్న పైలెట్ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి సైలెంట్‌గా పనులను చక్కబెడుతున్నారు. త్వరలోనే స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలిద్దరూ తమ వర్గం వారిని గెలిపించుకుని స్థానిక బలం చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి మెజార్టీ స్థానాలను గెలిపించేందుకు మాజీ ఎమ్మెల్యే పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు పార్టీ నేతలు వెల్లడిస్తున్నారు.

సంప్రదాయ విత్తనాన్ని | సంరక్షించుకుందాం

- వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- ముగిసిన విత్తన పండుగ



మాట్లాడుతున్న కోదండరెడ్డి

కడ్తాల్: కల్తీ విత్తనాల నిర్మూలన.. రైతుకే విత్తన హక్కు అంశాలకు చట్ట రూపం ఇచ్చి అమలు పరిచినప్పుడే దేశీ విత్తనాలను రక్షించుకోగలుగుతామని తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో మూడు రోజులుగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్–భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ తొలి విత్తన పండుగ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ విత్తనాలను సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. విత్తన సంరక్షణలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కూరగాయలు, ధాన్యాల విత్తనాలను భద్రపరుచుకుని పంచుకునే విధానాన్ని పునరుజ్జీవం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. మానవ సాంఘిక జీవనానికి విత్తనం మూలధారమన్నారు. గతంలో రైతులే మేలైన విత్తనాలను నిల్వ చేసి, ఇతరులకు పంచి వ్యవసాయం చేసేవారని, అలాంటి విత్తన మేథో సంపత్తి కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. విత్తనం మూలం ఇదం జగత్ అనే నినాదాన్ని ప్రాచుర్యంలోకి తేవాలని, ఆకుపచ్చ విప్లవం రావాలని అకాంక్షించారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 20 అంశాలతో ఐదు భాషల్లో డిక్లరేషన్ ప్రకటించారు. అనంతరం పాలసీ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి రచించిన ‘ఆరోగ్యానికి.. ఆహార భద్రతకు విత్తనం’ పుస్తకాన్ని విష్కరించారు. కార్యక్రమంలో సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, ఫౌండర్ లక్ష్మారెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై గొడ్డలి వేటు

- దోమ ఠాణా పరిధిలో దారుణం
- అల్లుడిపైనే అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి భార్య ఫిర్యాదు
- అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, (ఇన్‌సెట్‌లో) మొగులయ్య(ఫైల్)

దోమ: నిద్రలో ఉన్న వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు అత్యంత దారుణంగా నరికి చంపారు. ఈ ఘటన దోమ ఠాణా పరిధి మైలారం గేట్ సమీపంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఖమ్మంనాచారం గ్రామానికి చెందిన బోయిని మొగులయ్య(58)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. మొగులయ్యకు మైలారం గేట్ సమీపంలో వ్యవసాయ భూములుండడంతో అక్కడే షెడ్ వేసుకుని పశుపోషణ, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఆయన కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలో బంధువుల అంత్యక్రియలకు హాజరై తిరిగి పొలం వద్దకు వచ్చి స్నానం చేసుకుని నిద్రించాడు. చిన్నకుమారుడు, భార్య పద్మమ్మ ఇంటి వద్దే ఉన్నారు. పెద్దకుమారుడు శ్రీశైలం తిరుమల తీర్థయాత్రకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు మొగులయ్య మెడ, తలపై గొడ్డళ్లతో అతికిరాతకంగా నరికి చంపారు. ఉదయం పొలం వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఐ నాగేందర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలిని పరిశీలించి కారణాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అల్లుడిపైనే అనుమానం?

తన భర్తను అల్లుడే హత్య చేసి ఉంటాడని మృతుడి భార్య పద్మమ్మ పోలీసుల విచారణలో తెలిపింది. మృతుడి పెద్ద కుమార్తె నర్సమ్మను మోత్కూర్ గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. మామా అల్లుళ్ల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మొగులయ్య అల్లుడు కక్ష పెంచుకుని హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ హత్య కేసులో ఒకరి ప్రమేయమే ఉందా? ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సీఐని వివరణ కోరగా.. మృతుడి భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనుల ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని జానకంపల్లిలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములుగౌడ్, జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, మల్లేష్, రాంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి


రేహాన్ అహ్మద్ మృతదేహం

బంట్వారం: సరదాగా స్నేహితులతో కలిసి మామిడి తోటలోకి వెళ్లిన యువకుడు నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం బంట్వారం మండలంలోని బొప్పునారంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోహీర్‌కు చెందిన రేహాన్ అహ్మద్(18) రంజాన్ పండుగకు బొప్పునారంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. ఆదివారం తోటి మిత్రులతో కలిసి సమీపంలోని మామిడి తోటకు వెళ్లాడు. అక్కడ నీటి గుంతలో ఈత కొడదామని దూకడంతో లోతు అంచనా వేయలేక మునిగి చనిపోయాడు. తల్లి కమర్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం జరిపించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతగిరి: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వికారాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్–గోధుమగూడ రైల్వే స్టేషన్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడని స్థానికులు తెలపడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై క్రీమ్ కలర్ టీషర్ట్, లేత నీలం రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నారన్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

ల్యాబ్ అటెండర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: పాతకొడంగల్ గ్రామశివారులోని గిరిజన విద్యాలయంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ల్యాబ్ అటెండర్‌గా (రాత్రి వాచ్‌మెన్ ఒకటి, పగలు వాచ్‌మెన్ ఒకటి) పని చేసేందుకు ఏప్రిల్ 15వ తేదీ సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదోతరగతి అర్హతతో పాటు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు రీజినల్ కో ఆర్డినేటర్ సెల్ నంబర్‌లో 73829 31496 సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య


యమున (ఫైల్)

చేవెళ్ల: వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. చేవెళ్ల హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండే గోవిందగారి పురుషోత్తంరెడ్డికి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కాశీమందిర్‌కు చెందిన తరుణి అలియాస్ యమున(30)తో వివాహం జరిగింది. కొన్నేళ్ల పాటు వారిద్దరూ అన్యోన్యంగా ఉన్నారు. అనుకోకుండా శనివారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో ఆమె గదిలో గడియ పెట్టుకొని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎంత పిలిచినా బయటకు రాకపోవటంతో కుటుంబసభ్యులు తలుపు తెరిచి చూడగా విగత జీవిగా కనిపించింది. దీనిపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పండగ పూటా.. నీటి కోసం వేట

శ్రీరామ నవమి సంబురాల్లో ఊరూరా ప్రజలు మునిగి తేలుతుంటే.. ఆ గ్రామంలో మాత్రం తాగునీటి కోసం అరిగోస పడుతున్నారు. మిషన్ భగీరథ, స్థానిక బోర్లు మరమ్మతులకు గురవ్వడంతో తాగడానికి చుక్క నీరు లేక గొంతు ఎండుతోందని మండలంలోని ఊటుపల్లి తండావాసులు కన్నీటితో విలపిస్తున్నారు.

ఊటుపల్లి తండాలో తీవ్ర నీటిఎద్దడి
- ఖాళీ బిందెలతో బోర్ల వద్దకు క్యూ కడుతున్న తండావాసులు
- దూరభారంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన


నడుచుకుంటూ బిందెలతో నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

దోమ: భానుడి ప్రతాపానికి గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ సౌకర్యం ఉన్నా నిర్వహణ అధ్వానంగా ఉండడంతో పల్లెల్లో సక్రమంగా నీరు రావడం లేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఆదివారం దోమ మండల పరిధిలోని ఊటుపల్లితండాలో తాగు నీటి కోసం గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. నీళ్లు సక్రమంగా రాక ఖాళీ బిందెలతో పొలాల వద్దకు వెళ్లి బోర్ల వద్ద తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్యను తీర్చడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర కిలోమీటర్ నడవాల్సిందే

గ్రామంలో మొత్తం 300లకు పైచిలుకు జనాభా ఉంది. అందులో రెండు బోర్లు ఉన్నప్పటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా అవుతుంది. కానీ కొన్ని రోజులుగా భగీరథ నీరు రాకపోవడం, ఉన్న బోర్లలో మోటార్లు పాడవ్వడంతో నీటి ఎద్దడి ఏర్పడింది. దీనిపై పలుమార్లు అధికారులకు చెప్పినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమీప బోర్లు, బావులే తమకు దిక్కు అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవి కూడా అర కిలోమీటర్ దూరంలో ఉండడంతో అక్కడి నుంచి మందుటెండల్లో తెచ్చుకుంటున్నామని మదన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తాగు నీరు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పొలాల్లో ఉన్న బోర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న తండావాసులు

లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



తండాలో కొన్ని రోజులుగా నీరు రావడంతో లేదు. దీంతో సమీపంలోని బోర్ల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. దూరం భారం ఎక్కువ అయినప్పటికీ గత్యంతరం లేక నీటిని తెచ్చుకుంటున్నాం. అయినా అధికారుల్లో చలనం రావడం లేదు. వేసవిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– వాలిబాయ్, ఊటుపల్లితండా

బిందెలతో తెచ్చుకుంటున్నాం



తండాలో తాగు నీరు రావడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సైతం చేపట్టడం లేదు. అర కిలోమీటర్ దూరంలోని పొలాల వద్ద ఉన్న బోర్ల నుంచి నీటిని బిందెలతో తెచ్చుకుంటున్నాం. దీనిపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– సేవ్యానాయక్, ఊటుపల్లితండా

చర్యలు తీసుకుంటాం



నీళ్లు రావడం లేదని తండావాసులు తమ దృష్టికి తీసుకువస్తే ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ ద్వారా అవసరాలను తీరుస్తున్నాం. త్వరలో బోరు బాగు చేయించి ప్రజల నీటి కష్టాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి నీరు సక్రమంగా అందేలా కృషి చేస్తాం.

– రాజేశ్, ఇన్‌చార్జి ఎంపీఓ, దోమ

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక


శరత్‌చంద్ర


సాయి సాత్విక్


సింధూర


రాధిక

దుద్యాల్: మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు గురుకులానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం అశోక్ తెలిపారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 5వ తరగతి గురుకుల సీట్ల ఎంపిక కోసం పరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేసింది. దీంతో పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న శరత్‌చంద్ర, సాయి సాత్విక్, సింధూర, రాధిక ఎంపికయ్యారని ఆయన ఆదివారం ప్రకటించారు. కష్టపడి గురుకులాల్లో సీటు సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు వారిని అభినందించారు.

బావిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

కుల్కచర్ల: మతిస్థిమితం సరిగ్గా లేని వ్యక్తి బావిలో పడి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల గ్రామానికి చెందిన శివ్వని లక్ష్మయ్య(60) ఈ నెల 3 నుంచి కనిపించడంలేదు. కాగా ఆయనకు కొన్నిరోజులుగా మతిస్థిమితం సరిగ్గా లేక బట్టలు లేకుండా గ్రామంలో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులో మేకల కాపరులకు పాడుపడ్డ బావిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని బయటకు తీసి కుల్కచర్లకు చెందిన శివని లక్ష్మయ్యగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పరిగికి తరలించారు. మృతుడి కుమారులు మొగులయ్య, చంద్రమౌళిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

కార్మికులకు దుస్తుల అందజేత


కార్మికులకు దుస్తులు అందిస్తున్న శ్రీనివాస్

కేశంపేట: శ్రీరామచంద్రుడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మఫిషియల్ జర్నలిస్టు కమిటీ రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్(పేపర్ శ్రీను) అన్నారు. మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామంలోని దేవాలయం వద్ద ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణంలో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కల్యాణం తర్వాత భక్తులకు దాతల సహాయంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని పంచాయతీ కార్మికులకు ఆయన దుస్తులు అందించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు జర్పుల రాజు నాయక్, మాజీ సర్పంచ్ జగన్‌నాయక్, ఐజేయూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవేందర్ యాదవ్, జర్నలిస్టులు శివకుమార్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితుల పక్షాన పోరాటం

కొడంగల్: కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలుస్తుందని సీపీఐ సీనియర్ నాయకుడు ఇందనూర్ బషీర్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గ సీపీఐ పార్టీ సమావేశం ఆదివారం పట్టణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తు కార్యక్రమాలపై సీపీఐ పక్షాన చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. బడుగు బలహీన వర్గాలు, అణగారిన, దోపిడీకి గురి అవుతున్న బాధితుల పక్షాన పోరాటం చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి మహిమూద్ పార్టీ ఎజెండాను ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్, రాజు, ముస్తఫా, లక్ష్మణ్, శ్రీనివాస్, మహబూబ్‌ఖాన్, మోహన్, రహీమ్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చైన్ స్నాచింగ్

మహిళ మెడలోంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు అపహరణ


బాధిత మహిళ

కుల్కచర్ల: మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు మంగళసూత్రం అపహరించిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఏముకంటి నర్సమ్మ, భర్త బాలయ్యలు ఇంటి వద్దనే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం బాలయ్య శ్రీరామనవమి వేడుకలకు వెళ్లగా ఆమె ఇంటి పట్టునే ఉన్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి ఎదుట కూర్చున్న నర్సమ్మను లాక్కెళ్లి.. మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును గుంజుకున్నారు. దీంతో ఆమె మెడకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. కొద్దిసేపటికి పక్కింటి మహిళ గమనించి విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపింది. అనంతరం 108 అంబులెన్స్‌లో ఆమెను పరిగి ప్రభుత్వకి తరలించగా అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. కాగా పట్టపగలే గ్రామంలో దోపిడీ చోటు చేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు అవసరం

అత్తాపూర్: వేసవిలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని ఎన్ఎంగూడ చౌరస్తాలో బోయ రమేష్, టి.గురుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ... మండుతున్న ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక నేతలు సర్దార్ హర్మిందర్ సింగ్, నాగరాజు, రవీందర్‌గౌడ్, రమాదేవి, యాదయ్య, ఫరూఖ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిని విరివిగా ఏర్పాటు చేయాలని భారత్ వికాస్ పరిషత్ మణికొండ శాఖ అధ్యక్షుడు, ఎంప్లాయిస్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు ఎం.పెంటారెడ్డి అన్నారు. నవ సేవా సంకల్ప ట్రస్ట్ వారు భాగ్యలక్ష్మి కాలనీ దుర్గామాత దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటి దానంతో ఎంతో పుణ్యం వస్తుందన్నారు. మానవసేవే మాధవ సేవగా గుర్తించి తమకు తోచిన విధంగా సహాయ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

భూమి దక్కదనే కక్షతోనే..

సుపారీ ఇచ్చి హత్య చేయించిన దాయాదులు
- కారు ఢీకొట్టి మృతి చెందిన కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ వెంకటేశ్వర్లు


నిందితులను చూపుతున్న పోలీసులు

మహేశ్వరం: భూమిపై అత్యాశే ప్రాణాలు తీసింది. ఐదెకరాల పొలం తమకు దక్కదనే కక్షతో దాయాదిని సుపారీ ఇచ్చి కారుతో ఢీకొట్టి హత్య చేయించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోయిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు శంకరయ్య(60)కు తన దాయాదులైన గూడెపు నర్సింగ్‌రావు, గూడెపు కుమార్, గూడెపు శ్రీనివాస్‌లతో తండ్రుల కాలం నుంచి భూ తగాదాలున్నాయి. ప్రస్తుతం అవి కోర్టులో నలుగుతున్నాయి. ఇటీవల శంకరయ్యకు అనుకూలంగా ఐదు ఎకరాల భూమిపై ఇంజెక్షన్ ఆర్డర్ వచ్చింది. దీంతో వివాదాస్పదమైన భూమిలోకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నించారు. ఇది రుచించని దాయాదులు ఎలాగైన ఆయన్ని మట్టుబెట్టాలని పథక రచన చేశారు. ఇందుకు అదే గ్రామానికి చెందిన కొండని ప్రశాంత్‌ను ఎంపిక చేసుకున్నారు. తనకున్న రూ.12 లక్షల అప్పు తీర్చడంతో పాటు ఇల్లు నిర్మిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 2న మధ్యాహ్నం బైక్‌పై శంకరయ్య వెళుతుండగా ప్రశాంత్ కారులో వెనుక నుంచి ఢీకొట్టి హత్య చేశాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్, కాల్‌డాటా ఇతర వివరాలపై దర్యాప్తు ప్రారంభించారు. ముందుగానే పోలీసులు కారు డ్రైవర్ ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా వాస్తవాలు చెప్పాడు. ఈ మేరకు నిందితులు గూడెపు నర్సింగ్‌రావు, బక్కని కార్తీక్(నర్సింగ్ రావు బామ్మర్ది), గూడెపు కుమార్, గూడెపు శ్రీనివాస్‌లను అరెస్టు చేశారు. హత్య కేసును ఛేదించిన మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మధుసూదన్, క్రైమ్ కానిస్టేబుళ్లను డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి అభినందించారు.

మహనీయుల స్ఫూర్తిని చాటాలి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


అంగడిచిట్టంపల్లిలో సన్నబియ్యం భోజనం చేస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్ తదితరులు

పూడూరు: మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి జైబాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ యాత్రలో భాగంగా మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లిలో మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడి రాజ్యాంగ విలువలను కాపాడాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందన్నారు. అనంతరం గ్రామంలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ఘణపురం మొగులమ్మ ఇంట్లో సన్న బియ్యంతో చేసిన భోజనం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కడుమూరు ఆనందం, రఘునాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, శ్రీనివాస్, షకీల్, అజీంపటేల్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, సొసైటీ డైరెక్టర్ చెన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేశ్‌కుమార్, నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


ముఖ్య అతిథులను సన్మానిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

షాబాద్: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొమరబండ శ్రీ బుగ్గ రామేశ్వరస్వామి దేవాయలంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రాంరెడ్డి, దేవాలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మంగలి చెన్నయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబాష్ చంద్రబోస్, దేవాలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, రాణి, సునీత, మండల యూత్ అధ్యక్షుడు సురేందర్, నాయకులు యాదయ్య, మహేందర్‌గౌడ్, బుచ్చయ్య, పీసరి వెంకట్‌రెడ్డి, రాంచందర్ తదితరులు ఉన్నారు.

దుద్యాల్‌పై సీఎం ఫోకస్


దుద్యాల్ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు

- శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండలవాసులు

దుద్యాల్: కొడంగల్ నియోజకవర్గం అంటేనే టక్కున గుర్తుకువచ్చేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా ఇక్కడి ప్రాంతాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే వాదన ఉండేది. కానీ ప్రజలు రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించడంతో ముఖ్యమంత్రి పీటంపై కూర్చోవడంతో కొడంగల్‌కు మహర్దశ పట్టనుందని స్థానికులు గంపెడాశలు పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా కాలువల ద్వారా లక్ష ఎకరాలకుపైగా సాగు నీరు, కొడంగల్‌కు మెడికల్, నర్సింగ్, వెటర్నరీ కాలేజీలు తీసుకొచ్చారు. అదే స్థాయిలో కొత్తగా ఏర్పడిన దుద్యాల్ మండలంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది.

రోడ్లపై ప్రత్యేక దృష్టి

ఇక్కడి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఫోకస్ చేశారు. ముఖ్యంగా మండల పరిధిలో రోడ్డు సౌకర్యానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కుదురుమల్ల గ్రామం నుంచి మండల కేంద్రం మీదుగా పోలేపల్లి శివారు వరకు రూ.50 కోట్లు, మండల కేంద్రం నుంచి సాగారం తండా, హంసంపల్లి, లింగాయపల్లి మీదుగా అంతర్రాష్ట్ర రహదారి హైదరాబాద్ వరకు రూ.28 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇటీవల గౌరారం నుంచి లగచర్ల వరకు రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. అలాగే మండలంలోని తండాలు, పల్లెలకు రోడ్లు లేకుండా ఉండకూడదని నిధులు మంజూరు చేశారు.


గౌరారంలో నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ భవనం


పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం

మండలంలోని హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండా గ్రామాల్లో కాలుష్య రహితమైన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అడుగులేస్తుంది. అందులో భాగంగానే రైతుల వద్ద భూములు సేకరిస్తుంది. దాదాపు ఈ ప్రక్రియ పూర్తి కావస్తుంది. త్వరలోనే పారిశ్రామ వాడ ఏర్పాటుకు సంబంధించిన శంకుస్థాపన పనులు చేపట్టే అవకాశాలున్నాయి.

కార్యాలయాలకు సన్నాహాలు

మండల కేంద్రంలో ఉండే అన్ని రకాల కార్యాలయాలను దుద్యాల్‌లో నిర్మించేందుకు ప్రభుత్వం, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే అన్ని మండల కార్యాలయాలు ఒకే దగ్గర ఉండేందుకు సమీకృత భవనాలు, అంగన్వాడీ, హకీంపేట్‌లో సమీకృత విద్యాలయం, ఐటీఐ, ఇంటర్ కళాశాలల వంటి నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. మండలం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా రెవెన్యూ కార్యకలాపాలు మాత్రమే సాగాయి. కానీ ఇటీవల ప్రభుత్వం మండల పరిషత్‌గా మార్చడంతో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.


అన్ని రంగాల్లో అభివృద్ధి



నూతనంగా ఏర్పడిన మండలాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. అందుకు తగిన ప్రణాళిక ఏర్పాటు చేసుకుని సర్కారు నిధులు మంజూరు చేస్తుంది. కొడంగల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారు.

– వేణుగోపాల్, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్


ముఖ్యమంత్రి చొరవ



గత ప్రభుత్వం మండలంలో కనీస వసతులు కూడా ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మండల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం.

– వెంకటయ్య, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉపాధి కల్పనే లక్ష్యం



దుద్యాల్‌లో కంపెనీలు ఏర్పాటు చేస్తున్న తరుణంలో రైతులు భూములు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. పరిహారం పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వెంటనే అందిస్తున్నాం. ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు పొందాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

– శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు